క్లుప్తంగా

వీధిలైట్లు వెలగక అవస్థలు



జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో వీధిలైటు వెలగని స్తంభం

సింధియా : జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లోని శ్రీకృష్ణ మందిర్ సమీపంలో ఉన్న వీధిలైట్లు వెలగకపోవడంతో చీకటిలో సంచరించలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చీకటిపడితే తేళ్లు, జెర్రులు, పాములు తదితర విషకీటకాలు సంచరిస్తున్నాయని... ఇంటి నుంచి బయట అడుగు పెట్టాలంటేనే భయమేస్తోందని, పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు త్వరితగతిన స్పందించి వీధిలైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉక్కు కార్మికులకు వేతనాలు చెల్లించాలి



ఉక్కు ట్రాఫిక్ విభాగాధిపతికు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నాయకులు కోరారు. వేతనాల కోసం సీఐటీయూ నాయకులు అన్ని విభాగాధిపతులకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. ఈనెల కేవలం 50 శాతం జీతం మాత్రమే చెల్లించారన్నారు. 26వ తేదీ వచ్చినా ఇప్పటి వరకు మిగిలిన జీతం చెల్లించలేదన్నారు. జీఎస్టీ, కరెంటు చార్జీలు క్రమం తప్పకుండా చెల్లిస్తున్న యాజమాన్యం జీతాలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగుల జీతం నుంచి రికవరీ చేసిన సొమ్మును సైతం ఆయా ఖాతాలకు చెల్లించకపోవడం చట్ట వ్యతిరేకమన్నారు. కార్యక్రమాల్లో యూనియన్ ప్రధానకార్యదర్శి యు. రామస్వామితో పాటు ఆయా విభాగాల కమిటీల నాయకులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండగా..

- మమతా చారిటబుల్ ట్రస్టు పేరిట సేవా కార్యక్రమాలు
- జీవీఎంసీ షెల్టర్‌లో సేవాభావంతో విధులు
- అనాథలకు అన్నీ తానై అంత్యక్రియలు



షెల్టర్‌లో ఉన్న వారికి దుస్తులు పంపిణీ చేస్తున్న జీవీఎంసీ నైట్‌షెల్టర్ మేనేజర్ మమత

విశాఖవిద్య: మానవ సంబంధాలు కనుమరుగైపోతున్నాయి..అందరూ ఉన్నా ఎంతో మంది అనాథల్లా మిగిలిపోతున్నారు. అలాంటి ఎంతో మంది నిరాశ్రయులకు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎల్లేటి మమత అమ్మలా మారుతోంది. సేవాభావంతో విధులు నిర్వహిస్తూ మిగతా వారికి స్ఫూర్తిగా నిలుస్తోంది. అభాగ్యులు, నిరాశ్రయులకు మమత అందించిన సేవలకు గానూ కలెక్టర్, జీవీఎంసీ అధికారుల ప్రశంసలు అందుకున్నారు.

అమ్మలా ఆదరణ

జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైట్ షెల్టర్‌కు వచ్చే వారికి ఆశ్రయం కల్పించడమే కాకుండా వారికి అన్నీతానై సపర్యలు చేస్తున్నారు. ఎవరూ లేని అనాథల్లా బతుకు వెళ్లదీస్తున్నామనే మనోవేదన నుంచి అక్కడి వృద్ధులు బయట పడేలా షెల్టర్‌లో వివిధ కార్యక్రమాలు చేపడుతూ వారిలో సంతోషం నింపుతున్నారు. ఎవరిదైనా పుట్టిన రోజు అని తెలిస్తే అందరినీ ఒక చోటకు చేర్చి వారితో కేక్ కట్ చేయించడం వంటి కార్యక్రమాలు చేయిస్తుండడంతో షెల్టర్‌లో ఉన్న వారు మానసిక ఉత్సాహంతో ఉప్పొంగిపోతున్నారు.

షెల్టర్ నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ

జీవీఎంసీ ద్వారా రాత్రి పూట మాత్రమే భోజన సదుపాయం కల్పిస్తున్నారు. అయితే మమత తనకు ఉన్న పరిచయాలతో షెల్టర్‌లో ఉన్న వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. తెలిసిన వారి పుట్టిన రోజు, పెళ్లిరోజు మరేదైనా శుభకార్యాలు చేసుకున్నా షెల్టర్‌లో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టండి అనే మమత మాటతో పలువురు దాతలు సైతం ముందుకొచ్చి ఇక్కడి నిరాశ్రయులకు తోచిన రీతిలో సాయం అందిస్తున్నారు.

మానసిక రోగులకు వైద్య సేవలు: రహదారులు, రైల్వే స్టేషన్ల నుంచి షెల్టర్‌కు తీసుకొచ్చినవారిలో కొంతమంది మానసిక రోగులు సైతం ఉన్నారు. వారిని ఆస్పత్రిలో చేర్పించడంతో పాటు వారు కోలుకునేంత వరకు దగ్గరుండి మమత సేవలు అందిస్తున్నారు. ఇలాంటి వారి వివరాలను పూర్తి స్థాయిలో తెలుసుకొని వారి కుటుంబసభ్యుల చెంతకు చేర్పిస్తున్నారు. ఇలా 64 మందికి పైగా నిరాశ్రయులను వారి కుటుంబాల చెంతకు చేర్చినట్లు మమత తెలిపారు.

చారిటీ ద్వారా విశేష సేవలు

డిగ్రీ చదువుతుండగానే వివాహం కావడంతో అనకాపల్లి జిల్లా వడ్డాది ప్రాంతం నుంచి విశాఖపట్నం వచ్చిన ఎల్లేటి మమత ఓ స్వచ్ఛంద సంస్థలో ఉద్యోగానికి చేరారు. సేవలను విస్తరించాలనే ఆమె ఆలోచనకు తల్లిదండ్రులు, భర్త తోడుగా నిలవడంతో 2022లో 'మమత చారిటబుల్ ట్రస్ట్' ఏర్పాటు చేసి తోచిన రీతిలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆమె సేవలను మెచ్చి భెల్ యాజమాన్యం మినీ వ్యాన్ ఇవ్వడంతో విశాఖ నగరంలోనే కాకుండా, అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ఫుట్‌ఫాత్‌లపై ఉండే నిరాశ్రయులను షెల్టర్లలో చేర్పిస్తోంది. ఇలా ఇప్పటి వరకు 267 మందికి పైగా నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించారు. నగరంలోని మురికివాడల్లో ఉన్న చిన్నారులకు తమ సంస్థ ద్వారా స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలు, దుస్తులు అందిస్తున్నారు.



చిన్నారులకు బ్యాగుల పంపిణీ (ఫైల్)

ఆఖరిమజిలీలో అన్నీతానై..



కుటుంబ సభ్యులు వదిలేసిన వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత(ఫైల్)

కేజీహెచ్ లేదా మరేదైనా ఆస్పత్రిలో మృతి చెందిన వారిని తీసుకెళ్లేందుకు ఎవరూ రాని పరిస్థితుల్లో అక్కడి నిర్వాహకులు మమతకు సమాచారం ఇస్తారు. తనతోపాటు మరో నలుగురిని పోగు చేసి అనాథ శవాన్ని వాహనం ద్వారా శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలను నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులు వెన్నుదన్నుగా నిలుస్తోండడంతో అనాథల ఆఖరి మజిలీలో ఆ నలుగురులా మారే అవకాశం లభిస్తోందని చెబుతున్నారు ఎల్లేటి మమత. పిల్లలు సైతం తన బాటలో పయనిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని చెబుతున్నారు.

ఉత్సాహంగా తృతీయ సోపాన్ శిబిరం



జ్యోతి ప్రజల్వన చేసి శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ లతామాధురి



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

సింధియా: భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలికల తృతీయ సోపాన్ శిబిరాన్ని మల్కాపురం నౌసేనాబాగ్ కేంద్రీయ విద్యాలయం-1లో సోమవారం ప్రారంభించారు. మూడు రోజులు పాటు నిర్వహించనున్న ఈ శిబిరంలో మొదటి రోజు 23 పాఠశాలల నుంచి సుమారు 160 మంది బాలికలు పాల్గొన్నారు. హైదరాబాద్ రీజియన్ డివిజినల్ కమిషన్ ఆఫ్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ మంజునాథ్, అసిస్టెంట్ కమిషనర్ అనురాధ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి క్రైం డీసీపీ లతామాధురి, ప్రిన్సిపాల్ సుధీర్ కుమార్ మైంగీ, హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ సేట్ కమిషన్ ఆఫీసర్ జ్యోతి శిబిరాన్ని ప్రారంభించారు. న్యాయనిర్ణేతలుగా గజలక్ష్మి, జయశ్రీ, సాహిత్య, బిందు వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఎన్ఎస్‌టీఎల్ ప్రతినిధులు

విశాఖ విద్య:ఎన్ఎస్‌టీఎల్, రామంత్ సెకండరీ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. 5 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న వివిధ పాఠశాలలకు చెందిన 135 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. దేశ నాయకులు, సైన్స్ సంబంధిత అంశాల్లో నిర్వహించిన క్విజ్ పోటీలు విద్యార్థుల ఆలోచనా శక్తి పెంపొందించేందుకు దోహదపడతాయని ఎన్ఎస్‌టీఎల్ ఫార్మర్ డైరెక్టర్ ఎస్వీ రంగరాజన్ అన్నారు. విజేతలకు ఎన్ఎస్‌టీఎల్ ఫస్ట్ లేడీ లిన్ అబ్రహం, ఎన్ఎస్‌టీఎల్ ప్రతినిధులు హెచ్ఎస్ దాస్ బహుమతులను అందజేసి అభినందించారు.

అధ్వానంగా 'గణబాబు' మార్గ్ రహదారి



నాచు రహదారిలో నడవలేక రైల్వే ట్రాక్‌పై నడుస్తున్న పాదచారులు



నాచు పట్టిన గణబాబు మార్గ్ వంతెన రహదారి

కంచరపాలెం : జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులు పేటలో రైల్వే వంతెన ప్రాంతంలో 'గణబాబు మార్గ్' రహదారి నాచు పట్టి అధ్వానంగా మారింది. కంచరపాలెం నేతాజీ కూడలి నుంచి గవర కంచరపాలెం, ఆర్పీపేట, పైడిమాంబకాలనీ, దయానందనగర్, చాకలిగెడ్డ, రాజీవ్‌కాలనీ, ముత్యమాంబకాలనీ ప్రాంతాల ప్రజలకు రైల్వేగేటు సమస్య పరిష్కారం కోసం వంతెన మార్గం నిర్మించారు. అండర్ ఫుట్‌పాత్ మార్గం ఏర్పాటు చేసినా రహదారి అధ్వానంగా ఉండడంతో అటుగా ప్రయాణించే ఆయా కాలనీల పాదచారులు నరకయాతన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిలో నాచు పట్టి, రాళ్లు తేలి ప్రమాదభరితంగా మారిందని వాపోతున్నారు. నడిచేటప్పుడు జారి పడుతుండడంతో రైల్వే ట్రాక్ మార్గాన్నే వినియోగిస్తున్నామని పలువురు చెబుతున్నారు. ద్విచక్ర వాహనదారులు బ్రేకులు వేసేటప్పుడు స్కిడ్ అయి ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అండర్‌పాత్ వంతెన రహదారికి మోక్షం కల్పించాలని, రహదారిని నిత్యం శుభ్రం చేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు



62వ వార్డులో నిర్మించిన రోడ్డు



దుర్గానగర్‌లో నిర్మించిన మెట్ల మార్గం

సింధియా: జీవీఎంసీ 62వ వార్డులోని కొండవాలు ప్రాంతాల్లో గత ప్రభుత్వంలో ప్రతిపాదించిన పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. జీవీఎంసీ అధికారులు శ్రద్ధతీసుకోవడంతో పలు ప్రాంతాల వాసుల కష్టాలు తీరాయి. 2019 తర్వాత వార్డులో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు సమకూర్చారు. వీధుల్లో సైతం అంతర్గత రోడ్లు కూడా వచ్చి అద్దంలా మెరుస్తున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దర్గానగర్‌తో పాటు మిగిలిన కొండవాలు ప్రాంతాల్లో శిథిలమైన మెట్ల మార్గాలు, సీసీ రోడ్లు పూర్తి చేశారు. అవసరమైన చోట నూతన పైప్‌లైన్లు వేయడంతో తమకు నీటి కష్టాలు తీరాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కళింగ కోమటి సంఘ రాష్ట్ర కార్యదర్శిగా కోరాడ



కోరాడ శ్రీనివాసరావు

మల్కాపురం : రాష్ట్ర కళింగ కోమటి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం శ్రీకాకుళంలో ఆదివారం నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని సంఘ నూతన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులతో సమావేశమై రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని నియమించారని తెలిపారు. ప్రమాణస్వీకారం అనంతరం కళింగ వైశ్య సంఘ అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చించి యువతను అన్ని రంగాల్లో ఆదుకునేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

పోర్టు యాజమాన్యమే ఆస్పత్రి నిర్వహించాలి




చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 26వ రోజుకు చేరాయి. సీఐటీయూ నాయకులు చెవిలో పువ్వులతో శనివారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ త్రినాథరావు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరిస్తే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత ఉండదన్నారు. కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్న విశాఖపట్నం పోర్టు సొంత నిధులతోనే ఆస్పత్రిని నిర్వహించాలని, ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రైవేటీకరణ ద్వారా లబ్ధి పొందేది ప్రైవేటు వ్యక్తులు మాత్రమేనని, కార్మికులు మాత్రం అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఆస్పత్రి సేవలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి భానుమూర్తి, కూన వెంకటరావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సత్యారావు మద్దతు తెలిపారు. రాఘువులు, నాయుడు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి బ్లాస్ట్‌ఫర్నేస్ సందర్శన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ బృందం శనివారం గోదావరి బ్లాస్ట్‌ఫర్నేస్‌ను సందర్శించింది. ఆరు నెలలుగా నిలిచిపోయిన ఈ బ్లాస్ట్‌ఫర్నేస్‌ను పునః ప్రారంభించడానికి యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. ఇందుకు సంబంధించి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో యూనియన్ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్ నేతృత్వంలో నాయకులు బ్లాస్ట్‌ఫర్నేస్-1లో కార్మికులను, అధికారులను కలిసి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్లాస్ట్ ఫర్నేస్ విభాగాధిపతి నాగ్‌ను కలిసి ఫర్నేస్ ప్రారంభ వివరాలను తెలుసుకున్నారు. ఫర్నేస్ నిరంతరం నడిచేలా అవసరమైన రా మెటీరియల్స్ సిద్ధం చేయాలని కోరారు. తమ యూనియన్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గొందేశి ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ. నాయుడు, పోలీసు నాయుడు, పి.వి. నగేష్, పాల అప్పలరెడ్డి, సత్యారావు, గోవిందరాజులు, రమణ సుబ్బారావు, వంశీ, దేముడు తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నా విజయవంతం చేయండి



దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఈనెల 28న నిర్వహించతలపెట్టిన మహా ధర్నాను విజయంతం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలకు నిరసనగా ఉక్కు పరిరక్షణ కమిటీ కూర్మన్నపాలెంలో చేపట్టిన 1353వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్మికులను రకరకాలుగా తగ్గించుకుంటూ బడాబాబులకు కర్మాగారాన్ని దోచిపెట్టడమే లక్ష్యంగా కేంద్రం పావులు కదుపుతుందని ఆరోపించారు. వీటిని పోరాటాల ద్వారానే అడ్డుకోవాల్సి ఉందన్నారు. కేంద్రం ఆగడాలను అడ్డుకోడానికి 28వ తేదీన ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద చేపట్టనున్న మహాధర్నాలో కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మసేన్‌రావు, రామకృష్ణ, దేముడు, మిశ్ర, సీతారామరాజు, భాస్కరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.